కథానిక

# నీతిపరులు

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

టిక్కెట్ తీసుకుని ప్లాట్‌ఫారమ్‌మీదికి వెళ్ళేసరికి రైలు కదులుతూన్నది. త్వరగా ఒక కంపార్ట్‌మెంట్‌లోకి ఉరికాను. కేవలం హేండ్ బేగ్‌తో మాత్రం ప్రయాణంచేస్తూండడంవల్ల చాలాకష్టం లేకుండా...తలుపుమీద తెల్లగా రాసిన "రిజర్వుడు" గుర్తుమీదికి నా దృష్టిపోయేసరికి నేనేమీ చెయ్యలేని స్థితిలో ఉన్నాను. రైలు త్వరగా సాగిపోతూన్నది.

లోపలికి చూశాను. సెకండ్ క్లాస్ కంపార్ట్‌మెంటే. ముగ్గురు నలుగురుకన్న లేరు. ఒక అమ్మాయీ, మరో యువకుడూ-కొంచెం వయస్సు ఉన్న ఒక పెద్దమనిషీ...దూరంగా ఎవరో ముసిలాయన.

నేను లోపలికివెళ్ళి ఖాళీగా ఉన్న ఒక కిటికీ దగ్గర కూర్చున్నాను నాకు నేనే క్షమాపణ చెప్పుకుని. యువకుడు నావంక చాలాసార్లు చూస్తున్నాడు. అతనే కంపార్ట్‌మెంట్ రిజర్వు చేయించుకున్నాడనుకున్నాను.

"సారీ...మీకు అంతరాయం కలిగించను...వచ్చేస్టేషన్‌లో మారతాను" అన్నాను. యువకుడి సిల్కుబట్టలకీ, అతనిచేతిలోని త్రీకాసిల్స్ టిన్నుకీ కొంత గౌరవంయిస్తూ.

అతను పెద్దగా నవ్వాడు. మిగిలినవాళ్లు ఏమీ అర్థంకానట్లు నా వంక చూశారు. నేనూ అలాగే.

అతను హఠాత్తుగా నవ్వుని ఆపి—"ఎందుకూ దిగిపోవడం?—టికెట్ లేదా?" అన్నాడు.

"మీరీ కంపార్ట్‌మెంట్ రిజర్వు చేసుకోలేదూ?" అన్నాను.

"సరీ...అయితే నాటకం పనిచేసింది!" అన్నాడు యువకుడు. ఈసారి అందరమూ అతనివైపు చూశాము.

"అవతలిస్టేషనులో ఎవరో కుర్రాడురాసేడు" అతను నవ్వుతూ అనేశాడు-నేను త్వరగా వెళ్ళి చెరుపుదామనుకున్నాను. కాని అంత పరోపకారి పోజు ఒక్కసారి వెయ్యలేక కూర్చుని, ఇటు తిరిగి సంచీలోంచి ఫిలింజర్నల్ తీసుకున్నాను.

ఆ అమ్మాయి చేతిలో ఉన్న పుస్తకం ఏమిటా అని ఓసారి చూశాను. అగాథాది...సీరియస్‌గా చదువుకొంటూన్నది. నేను నా పుస్తకంలో కొంచెంసేపు గడిపి, క్రిందపడేసి, కిటికీలోంచి బయటికిచూస్తూ కూర్చున్నాను.

"అయితే, ఒరే విశ్వం! ఎక్కణ్ణించి వొస్తున్నావు, ఎక్కడికి పోతున్నావు?...చెప్పరా!"

పెద్దమనిషి యువకుణ్ని ప్రశ్నించాడు...ఆ గొంతుకనిబట్టి వాళ్లు చిరకాల మిత్రులనీ, చాలాకాలం తరువాత ఇప్పుడే కలుసుకున్నారనీ తెలుసుకున్నాను.

"ఏం చెప్పేది బాబాయ్!...నీ ఆశీర్వచనంవల్ల నా పరిస్థితి అంతా మారిపోయిందనుకో. ఒకసారి మన వూరువొచ్చి అందర్నీ చూడాలని ఉంది. ప్రస్తుతం వైజాగ్ కొంచెం షిప్పింగ్ బిజినెస్‌మీద వచ్చాను. మద్రాసు వెళ్తున్నాను."

పెద్దమనిషి చాలా ఇంప్రెస్ అయినాడులా ఉంది. "అసలు నువ్వు చేస్తూన్న ఉద్యోగం ఏమిట్రా?" అన్నాడు.

"కమిషన్ వ్యాపారం బాబాయ్! కొన్ని వందలమందిని లక్షాధికారులుగా, కోటీశ్వరులుగా చేసిన వ్యాపారం. తెలివి తేటలుంటే తిరుగులేదనుకో! ఇక్కడ సరుకు ఖరీదుచేసి షిప్ చేసేదమే...బిజినెస్...నూటికి రూపాయ్. నిన్న రెండు లక్షల సరుకు లోడ్ చేయించేనా?"

"రెండు...వే...లు..."

"ఆఁ. రెండువేలు-రాకపోదునుగాని మొహమాటం అయిపోయింది బాబాయ్! కట్, షైన్ అందుకో అని-లండన్‌లో ఇక్కడికొచ్చినప్పుడు చాలా పరిచయం అయిపోయింది. అస్తమానం లండన్ రమ్మని ఉత్తరాలే! సిగరెట్ కాల్చు బాబాయ్."

"నాకు చుట్టఉంది లేరా."

"ఫరవాలేదు లే. ఈ సిగరెట్లు మనకి చాలవు. చాలా మైల్డుగా ఉంటాయి. ఫూర్ వైజాగ్‌లో టిన్ ఆరుంబావలా కన్న పెద్దరకం దొరకలేదు."

"ఆరుంబావలా?"

"అంతే బాబాయ్! చవకరకం!"

పెద్దమనిషి తాను కాలుస్తూన్న సిగరెట్ వంకే పరీక్షగా చూశాడు. యువకుడుమాత్రం అలారం లాగా కొట్టుకుపోతున్నాడు.

"అంతా ఖులాసాయేనా బాబాయ్? ఓసారి వచ్చి చూద్దామంటే బొత్తిగా కుదరడం లేదనుకో. రేపు సాయంత్రం ఎయిర్‌లో కలకత్తా పోవాలి. తరవాత బొంబాయి అబ్బబ్బ. ఛస్తూంటేనే!... అయితే మీ వెంకటమహాలక్ష్మికి పెళ్లి చేసేసేవా?"

"ఇంకాలేదురా. ఇంక సంబంధాలుచూడాలి. చెల్లెలు కూతురైతేనేం ... నా కూతురైతేనేం, ఒకర్తేగా..."

"అంతేబాబాయ్! నీ విశాలదృష్టిగురించి నాకెప్పుడూ తెలుసును. అయితే సంగీతం నేర్చుకుంటోందా ఇంకా?"

"ఓ...పదో ఇరవయ్యో కృతులొచ్చాయి. కిట్టక అందరూ అలా అంటారుగానీ—దాని గొంతుకా, ఆ సంగీతమూ ఎవళ్ళకివొస్తాయిరా?"

"నిజం-నిజం బాబాయ్! ప్రపంచం అంతా ఒట్టి దగాకోరులనుకో...నాది అరవై వేలు మొన్న షిరాన్ బేంక్‌నించి విత్‌డ్రా చేస్తే, బేంక్‌రప్ట్ అయిపోయేనన్నారు. ఎంత గొప్ప వ్యాపారంలో పెట్టానో వీళ్ళకి తెలుసా?"

"వాళ్ళకేం తెల్సురా?"

"బాగా అన్నావు. ఇంత వ్యాపారం ఒక్క చేత్తో చేసుకొస్తున్నానుగదా... అంత తెలివి తక్కువగా అడుగు వేస్తానంటావా?"

"అబ్బే! నువ్వు చాలా జాగ్రత్త అయిన వాడివి."


"నాసంగతి నీకు తెల్సు బాబాయ్! ఓసారి మదరాసు తప్పకుండారా... నాలుగు దేశాల వర్తకులకీ పరిచయంచేసి వదిలేస్తాను. మీ జిల్లా వేరుసెనగ అంతా నూటికి పాతికలు ఎక్కువ ఇచ్చి కొనేయి...లాభం అంతా మనదే."

"అంత ఖరీదొస్తుందిట్రా?"

"నీకేం తెల్సు బాబాయ్! వేరుశెనగ అన్న అక్షరాలు వింటేచాలు. డబ్బు కురిసేస్తుంది. వాళ్ళు ఆ తొక్కలని యంత్రాలతో కాగితాలుగా తయారుచేస్తారు, ఆ పలుకుల్లోంచి నూనెలూ, అత్తరులూ, సబ్బులూ, బిస్కట్లూ, తయారు చేసేస్తారు."

"ఒరేయ్ విశ్వం! ఎంతవాడివయ్యావురా!"

"ఇదేముంది బాబాయ్! ఒక షిప్ కాంట్రాక్ట్ కొట్టేద్దామని చూస్తున్నాను. అదిగాని కుదిరిందా మనవూళ్ళో ఎయిరోడ్రోమ్ కట్టించాలనుకో... ఇవాళ బొంబాయ్, రేపు బర్మింగ్‌హాం, ఎల్లుండి కొలంబో - కాన్‌బెర్రా, అబ్బ! తీరుబాటులేదనుకో."


నిర్దుష్టమైన లెన్సు గ్రైండింగు లెబొరేటరీ మావద్దనే ఉన్నది. డాక్టర్లు నిర్ణయించిన పద్ధతులపై, సాంకేతికముగ సరియైన కళ్లజోళ్లను మేము అందివ్వగలము.

శ్రేష్ఠత—పనితనము—మర్యాదలకు—

రాధా బ్రదర్స్

ఆప్తాల్మిక్ ఆప్టిషియన్సు

ఫోను: 4198

174, బ్రాడ్వే, మద్రాసు-1.

ఐస్ అయిపోయి వింటున్నాడు పెద్దమనిషి.

"ఆ జర్నల్ ఒకసారి ఇస్తారా?"

డిటెక్షన్ పూర్తి అయినట్లుంది—అమ్మాయి అడిగింది.

ఇస్తూ, "మీపుస్తకం ఓసారిఇవ్వండి" అన్నాను.

"లాభం లేదండీ. నూరునుంచి నూటపన్నెండు దాకా పేజీలు ఎగిరిపోయాయ్. సరీగా విక్టర్ రైలు కోసం కారుమీద రష్ అయేదగ్గరే ఈ అఖాతం వొచ్చేసింది. ఏమైందో ఏమో!" అది...చాలా ఆందోళనగా.

"నేను చదివేనులెండి" అన్నాను.

"ఏమైందండీ?" అంది అమ్మాయి-ఆత్రుతగా నావంక తిరుగుతూ.

"విక్టర్ రష్ ఆయేసరికి ట్రెయిన్ బ్లూ క్రాస్ స్టేషన్ వదిలేస్తుంది. హీరోయిన్—అదే కాలేజీ లెక్చరర్..."

"ఆఁ...నెల్లీ..."

"అవును. నెల్లీ స్టేషన్లో కనిపించి డ్రమ్మండ్ నించి వొస్తున్నాననీ, అక్కడ ఎఫీలీ కనిపించిందనీ, ఆమెదగ్గర ఆ ఎర్ర అట్టల పుస్తకం చూశాననీ, ఆమె తనిని చూడలేదనీ చెప్తుంది."

"అరే!...ఎఫీలీ బ్రతికే ఉందా?"

"ఆఁ...కార్ స్మేష్లో ఆవిడ చాలా విచిత్రంగా తప్పించుకుని ఉంటుంది."

"ఆ పుస్తకం విక్టర్ సెల్లోనించి యెలా వెళ్ళింది?"

"బ్లాకర్ దాన్ని తీసికెళ్ళి కొన్ని ఫొటో స్టాట్లు తయారుచేయించడానికి వెళ్తూంటాడు... కార్ స్మేష్లో అతను చనిపోతాడు. పుస్తకం ఆమెకి దొరుకుతుంది."

"నెల్లీ ఆ పుస్తకం పోలీసులకిస్తే మిస్టరీ సాల్వ్ అవుతుందే!"

"అవదు!"

"ఏం?"

"అందులో మూడు పేజీలు ఉండవు!"

"అయ్యయ్యో!"

"ఆఁ. చివరకి ఆ మూడు కాగితాలనీ పోలీస్ డాగ్స్ సహాయంతో ట్రేస్ చేస్తారులెండి..."

"అందుకా 'మిస్టరీ ఆఫ్ దినోస్' అంది!"

"అవును"

"గొప్పగా ఉంది."

ఆవిడ తిరిగి తనపుస్తకంలో లీనం అయింది. ఇంతలో మాస్టేషన్ రానేవొచ్చింది. పెద్దమనిషి త్వరగాదిగి..."వొస్తాంరా విశ్వం!" అన్నాడు.

"గుడ్ బై బాబాయ్...అడ్రస్ కార్డ్ ఇస్తానుండు."

కాని, మరుక్షణం యువకుడిముఖం అమెరికన్ ఫ్లేగ్లా నక్షత్రాలు మెరిపించింది.

"ఏమిట్రా?"

"స్కాండ్రల్... ఎవడో జేబుకొట్టేశాడు బాబాయ్!"

"అరే!"

యువకుడు ప్రక్క జేబు చిరిగినది చూపేడు.

"ఎలాగరా!"

"ఏదోచేస్తాను...వెళ్ళగానే పంపుతాను—కొంచెం డబ్బియ్యి బాబాయ్. రేపుకలకత్తా వెళ్ళాలి. లేకపోతే వైర్ చేసి ఇక్కడికే తెప్పించుదును."

పెద్దమనిషి త్వరగా జేబులోపర్స్ తీసి అతని చేతిలో ఉంచుతూ, "మూడొందల పదహారు రూపాయలఏనిమిది—చిల్లర ఉంది...వెళ్లగానే"

"టి. ఎమ్. ఓ. చెయ్యనూ?......వెడతాను బాబాయ్... దిగులుపడకు— సరిపోతుందిలే!" అన్నాడు యువకుడు. రైలు కదిలిపోతోంది... నా ఫిలింపత్రిక ఆ మహిళామణి ఉంచుకుంది—పుస్తకంలో లీనమై బయటికి చూడనేలేదు... ఊళ్ళోకి బయలుదేరాను. రైలు వెళ్ళిపోయింది.

* * *

ఆ సాయంత్రం కాఫీత్రాగుదామని ఒక హోటల్లోకి వెళ్ళాను. ఒకటేబుల్ దగ్గర రైలులోని పెద్దమనిషీ, గౌరవనీయులులాగ కనిపిస్తోన్న మరినలుగురు పెద్దలూ కూర్చున్నారు.

"మనవిశ్వం జ్ఞాపకం ఉన్నాడా?"

"సరే—వాణ్ని మరిచిపోతామా?... ఎక్కడైనా కలిసేడా ఏమిటి?"

"ఆఁ. రైల్లో మదరాసు వెళ్తున్నాడు వైజాగ్ నించి. వాడిపని ఎంతబాగుందంటారు?"

ఆయన జరిగినదంతా అక్షరం పొల్లుపోకుండా వర్ణించిచెప్పేడు. చివరకి తాను డబ్బిచ్చినవిషయం కూడా చెప్పేడు.

ముందు వాళ్ళల్లో ఒకాయన నవ్వాడు. తరువాత అందరూ నవ్వేరు.

"విశ్వం సంగతి మీకు తెలీదుటండీ? వాడక్కడ ఒక మిల్లులో ఫిట్టర్ గా పని చేస్తున్నాడు."

నామిత్రుడు తెల్లబోయాడు.

"నిజమే?"

"ఓ...అక్షరాలా వాళ్ళనాన్నని అడగండి కావస్తే."

"పోనీండి... నేను మాత్రం దాని మాటలు నమ్మి ఇచ్చానంటారా ఏమిటి?"

"వాడిమాట లెవ్వరూనమ్మరు!"

"అంతే... ఏదో అవసరంలో ఉన్నాడు. మన ఊరువాడు. సరే అన్నాను. ఇంతకీ నాకు పరాయివాడా? ఇచ్చిందిమాత్రం ఏపాటి!"

"అబ్బే... అంతే!"

క్లబ్బుకి వెళ్ళినప్పుడల్లా పెద్దమనిషి మిత్రులలో తరచు విశ్వాన్ని తిడుతూనే మాట్లాడుతూ ఉండేవాడు. "వాడు వట్టి మోసగాడేనండీ! నాకు తెలీదు గనకనా!...అయినా ఎంతో అవస్థలో ఉంటే ఎందుకు సాయం చెయ్యకపోవాలి? అని ఇచ్చాను..."

ఈ ధోరణిలో సాగేది సంభాషణ.

నవ్వుకొనేవాడిని.

రాఘవరావు మా వూరు పోస్టాఫీసులో గుమాస్తా. సాయంత్రం అతన్నోసారి కలుసుకుందామని ఆఫీసువైపు వెళ్ళాను. మనీఆర్డర్లు రిసీవయినవి లెక్క వేసుకుంటున్నాడు. కూర్చున్నాను.

"ఈఫిగర్స్ ఓసారి డిక్టేట్ చెయ్ భాయ్ కిట్టడం లేదు" అంటూ మనిఆర్డరు ఫారాలు ఇచ్చాడు.

వరుసని చెప్తూంటే ఒక మొత్తం ఎందుకో కొంచెం పరిచితంగా కనిపించింది, 316-8-0.

జ్ఞాపకంవచ్చించి త్వరగా చూశాను.

"పి. విశ్వం, ఫిట్టర్-ఆర్. సి. వర్క్ షాప్."

ఆ పెద్దమనిషిదే అడ్రస్. క్రింది అడ్రస్ కూడా చూశాను. మిత్రుడికి క్షమాపణ చెప్పి కూపన్ లో వ్రాసినది చదివేను.

"బాబాయ్! నీదగ్గర నాటకం ఆడానని నీకు తెలిసే ఉంటుంది-నా ఉద్యోగం సంగతి. కాని నిజంచెప్తే నా అవసరం తీరదని నాకు తెల్సును. అందుతే అబద్ధం ఆడాల్సొచ్చింది. క్షమించు. డబ్బుపంపడం కొంచెం ఆలస్యం అయినందుకూ క్షమించు—విశ్వం."

నాకు ఏదో చిత్రమైన గౌరవం కలిగింది విశ్వం అంటే. ఇటుపైని అతని మంచితనం వీరందరూ తెల్సుకుంటారని అనుకున్నాను.

మర్నాడు మనీ ఆర్డర్ పేమెంట్ అయింది. కాని, ఆ సాయంత్రం క్లబ్బులో ఆయన విశ్వాన్ని మామూలుగానే తిట్టాడు. తరువాత చాలా సాయంకాలాలు మిత్రులతో ఆయన గడుపుతున్నప్పుడు, విశ్వం విషయం వొచ్చినప్పుడల్లా ఆయన విశ్వాన్ని తిడుతూనే ఉన్నాడు.

ఆయన పెద్దమనిషి, విశ్వాన్ని తిడుతూన్న వాళ్ళందరూ పెద్దమనుషులు...అదిమాత్రం నిజం-వాళ్ళందరూ విశ్వాన్ని "ఫూల్"అంటారు.

అదీ నిజమేననిపిస్తూంటుంది—అప్పుడప్పుడు!

---

స్కెచ్

# స్మృతిపథంలో జామిచెట్టు

న. రా. శివస్వామి

జామిచెట్టు! - పచ్చగా చల్లగా, చెట్టు ఎంతో నిండుగా వుండేది. తులసికోట పక్కని కొంచెం ఏటవాలుగా, ఠీవిగా నిలబడి జామిచెట్టు పెరటికెంతో శోభని చేకూర్చుతూ ఉండేది. గుబురుగావున్న ఆకులు - ఆకులమరుగున ఉన్న పిందెలు, కాయలు-చిలుకకొట్టు పళ్లు-ఉదయాస్తమయాల్లో చెట్టునాశ్రయంగా చేసికొని కిలకిలారావాలుచేసే పక్షులు - అన్నీ ఎంత అందంగా ఉండేవి!

* * *

"చెల్లీ నాకు రెండు కాయలు దొరికేయే."

"నాకైతే మంచి చిలక్కొట్టుపండు దొరికింది!"

"నాకోముక్కియ్యవ్?"